# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ యూరియా సరఫరా, ఉల్లి మద్దతుధర మొదలగు అంశాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు.
- ❖ రాష్ట్ర సమాచార కమిషన్ విచారణల ప్రత్యక్ష ప్రసారాన్ని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ప్రారంభించారు.
- ❖ విద్యార్థులకు ఆరోగ్య భద్రతతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఎస్. సవిత స్పష్టం చేశారు.
- ❖ భావితరం జీఎస్టీ సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయని శ్రీకాకుళం జిల్లా వాసులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

=====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. యూరియా సరఫరా, ఉల్లి కొనుగోళ్లు, తురకపాలెం గ్రామంలో ఆరోగ్య పరిస్థితి మొదలగు అంశాలపై ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా.. రాష్ట్రంలో ప్రస్తుతం 80,503 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వ ఉందని.. రానున్న 10 రోజుల్లో 23,592 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని అధికారులు తెలిపారు. రైతులకు ఎక్కడా యూరియా సమస్య లేకుండా చూడాలని, యూరియాను అక్రమంగా నిల్వ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కర్నూలు మార్కెట్ లో ఉల్లి కొనుగోళ్లు, మద్దతు ధరపైనా సమీక్షించిన ముఖ్యమంత్రి.. ఉల్లి ధర క్వింటాలుకు 1,200 రూపాయల కంటే తగ్గకుండా చూడాలని స్పష్టం చేశారు. అరకు కాఫీ పంటకు సోకిన కాయతొలుచు తెగులు అంశాన్ని ప్రస్తావించిన ముఖ్యమంత్రి తెగులు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే.. తురకపాలెం గ్రామ ప్రజల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

=====================

రాష్ట్ర సమాచార కమిషన్ రెండవ అప్పీళ్లు, ఫిర్యాదుల విచారణల ప్రత్యక్ష ప్రసారాన్ని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఈరోజు ప్రారంభించారు. రాజ్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర సమాచార కమిషన్

విచారణల ప్రత్యక్ష ప్రసారం.. కమిషన్ కార్యకలాపాలలో పారదర్శకతను మరింత పెంచుతుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమాచార కమిషన్ కృషిని గవర్నర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సమాచార కమిషన్ ప్రధాన సమాచార కమిషనర్ హీరాలాల్ సమారియా, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ ఆర్.కె. పాఠక్ తదితరులు పాల్గొన్నారు.

=====================

నాణ్యమైన విద్య అందించడంలో మహాత్మా జ్యోతీరావు పూలే (ఎంజేపీ) గురుకుల పాఠశాలలు కార్పొరేట్ విద్యా సంస్థలతో పోటీపడుతున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలోని ఎంజేపీ పాఠశాలలో స్మార్ట్ పే ఫోన్లను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులతో కలిసి మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కార్పొరేట్ విద్యా సంస్థల కంటే ఎంజేపీ స్కూళ్లకే డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. బీసీ విద్యార్థులకు ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలోని 110 ఎంజేపీ స్కూళ్ళలో 700ల వరకూ స్మార్ట్ పే ఫోన్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ ఫోన్ల ద్వారా విద్యార్థులు తమ తల్లిదండ్రులతో మాట్లాడుకునే అవకాశం కల్పించామని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. వస్తు సేవల పన్ను (GST)లో తీసుకువచ్చిన నూతన సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయని శ్రీకాకుళం జిల్లా వాసులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. జీఎస్టీ సంస్కరణల పట్ల పలువురు ఈరోజు ఆకాశవాణితో మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లకు అభినందనలను తెలియజేశారు. నిత్యావసర సరుకులు, ఆటోమొబైల్, విద్యా, వైద్య రంగాలకు సంబంధించి పేద, మధ్యతరగతి వారికి ఉపశమనం కలిగించేలా GSTపై మార్పులు చేశారన్నారు. ఆరోగ్య, జీవిత బీమాలపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేయడం పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని శ్రీకాకుళం జిల్లా వాసి మాట్లాడుతూ....

(వాయిస్ 33 సెకన్లు)

=====================

న్యూఢిల్లీలోని బాలయోగి స్టేడియంలో జరుగుతున్న భారతీయ జనతా పార్టీ, ఎన్డీయే కూటమి పార్లమెంట్ సభ్యుల కార్యశాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరి కొద్ది సేపట్లో ప్రసంగించనున్నారు. నిన్న ప్రారంభమైన ఈ కార్యశాలలో సీనియర్ బిజెపి నాయకులు, పార్లమెంటు సభ్యులు వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి పార్లమెంటరీ పార్టీ జిఎస్టి సంస్కరణలపై ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.

విరామం

=====================

ఆంధ్రప్రదేశ్‌లో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వాహణాధికారిగా ఉన్న జె. శ్యామలరావును జీఏడీ ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేసి, ఆయన స్థానంలో అనిల్ కుమార్ సింఘాల్‌ను నియమించింది. రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఎం.టి. కృష్ణబాబు, రెవెన్యూ, ఎక్సైజ్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ముఖేశ్‌కుమార్ మీనా, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా సీహెచ్ శ్రీధర్, అటవీ, పర్యావరణ శాఖల కార్యదర్శిగా కాంతిలాల్ దండేలను నియమిస్తున్నట్లు ఆ ఉత్తర్వులలో పేర్కొంది.

=====================

కృష్ణా జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ.. యూరియా సరఫరాపై అధికారులతో కలిసి ఈరోజు క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తోందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. పంటల సాగు విస్తీర్ణాన్ని అంచనా వేసుకుని, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా అవసరమైన యూరియా నిల్వలు గ్రామాలలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాకు మరొక 8 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని ప్రభుత్వానికి తెలియజేశామని, దీనికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సరఫరా చేస్తామని హామీ ఇచ్చిందని కలెక్టర్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

అమృత్, స్వచ్ఛ భారత్ పథకాల కింద పనులు త్వరితగతిన జరుగుతున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. అనంతపురంలో ఈరోజు ఆయన చెత్త తరలింపు పనులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అనంతపురం డంపింగ్ యార్డులో చెత్త తరలింపు వేగంగా సాగుతోందని, ఇప్పటికే 60 శాతానికి పైగా తరలింపు పూర్తయిందని చెప్పారు. అక్టోబర్ 2 నాటికి చెత్త లేకుండా చేస్తామని, డంపింగ్ యార్డు స్థానంలో ఒక పార్క్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అన్నింటినీ నెరవేరుస్తున్నామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

=====================

నగరాలలో పర్యావరణ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (NCAP) మంచి ఫలితాలనిస్తోంది. దీనిలో భాగంగా గుంటూరు నగర పాలక సంస్థ వినూత్న కార్యక్రమం చేపట్టింది. నగరంలో వాయు కాలుష్యాన్ని నియంత్రించటం ద్వారా జాతీయ స్థాయి గుర్తింపు కోసం మిషన్ గ్రీన్ పేరిట మొక్కలు నాటే కార్యక్రమం శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం ద్వారా రానున్న సంవత్సర కాలంలో నగర పరిధిలో 5 లక్షల మొక్కలను నాటనున్నామని గుంటూరు నగరపాలక సంస్థ కమీషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ప్రజలు దీనిలో భాగస్వాములు అయి.. ఉచితంగా మొక్కలను పొందేలా ఈ కార్యక్రమం రూపొందించామని కమీషనర్ పేర్కొంటూ ...

(వాయిస్ 33 సెకన్లు)

=====================

దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తాంధ్ర సముద్రతీర ప్రాంతంలో సగటు సముద్ర మట్టానికి 1.5 నుండి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దీని ఫలితంగా రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో రాగల రెండు రోజుల పాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని చెప్పారు.

=====================
=====================